


6&7
నమస్తే తెలంగాణ
హైదరాబాద్,
శనివారం 28
అక్టోబర్ 2023




టాటా బోయింగ్ ఏరోస్పేస్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రి కేటీఆర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా (ఫైల్)

# ఉపాధి హబ్ హైదరాబాద్

## తొమ్మిదేండ్లలో 12,862 పరిశ్రమలు ............ 7,42,790 మందికి ఉపాధి

**స్వరాష్ట్రంలో** హైదరాబాద్ ఉపాధి హబ్‌గా మారింది. దేశ, విదేశీ పెట్టుబడులకు స్వర్గధామమైంది. ఔటర్ చుట్టూ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనతో పారిశ్రామిక ప్రగతి ఎల్లలు లేకుండా విస్తరిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'టీఎస్‌ఐపాస్' రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అద్భు తాలను సృష్టిస్తున్నది. నలు దిశలా ఏర్పాటవుతున్న పరిశ్రమలతో యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కేవలం 9 ఏండ్లలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రూ. 62,690.48 కోట్ల పెట్టుబడులతో 12, 862 పరిశ్రమలు ఏర్పాటవ్వగా, ఏకంగా 7,42,790 మందికి ఉపాధి లభించింది. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు రానుండటంతో యువతలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



-మేడ్చల్/రంగారెడ్డి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ)

### ఇదీ రంగారెడ్డి ముఖచిత్రం..

తొమ్మిదేండ్ల కాలంలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ, మధ్య తరహా, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు 1,252 ఏర్పాటవ్వగా.. వీటితో ప్రత్యక్షంగా 5,15,851 మంది ఉపాధి పొందుతున్నారు. ఉపాధి అవకాశాల్లో పారిశ్రామికవేత్తలు స్థానికులకే ప్రాధాన్యత ఇస్తుండగా..ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు సైతం ఉపాధి పొందుతున్నారు.

| పరిశ్రమలు | యూనిట్లు | పెట్టుబడి (రూ.కోట్లలో) | కల్పించిన ఉపాధి |
|---|---|---|---|
| సూక్ష్మ | 470 | రూ.274.07 | 8,538 |
| చిన్న | 541 | రూ.2,069.81 | 18,609 |
| మధ్య | 67 | రూ.1,031.10 | 6,688 |
| భారీ | 83 | రూ.4,140.45 | 22,714 |
| మెగా | 91 | రూ.39,546 | 4,59,302 |

### పెట్టుబడుల వెల్లువ..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు రంగారెడ్డి జిల్లాలో కేవలం 3వేల 328 కోట్ల పెట్టుబడులతో 2,777 పరిశ్రమలు మాత్రమే ఏర్పాటయ్యాయి. అప్పట్లో కేవలం 45,763 మందికి మాత్రమే ఉపాధి కల్పించబడింది. రాష్ట్రం ఏర్పాటు తర్వాత పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలిరావడంతో ప్రస్తుతం జిల్లాలో 47 వేల 62 కోట్ల పెట్టుబడులతో 1,252 పరిశ్రమల ఏర్పాటు ద్వారా 5,15,851 మందికి ఉపాధి పొందుతున్నారు. ప్రముఖ సంస్థలైన ఫాక్స్ కాన్, గూగుల్, బోయింగ్, విప్రో, ప్రీమియర్ ఎనర్జీస్, రేడియంట్, ఓరియంట్, ఆస్ట్రల్ వంటి పరిశ్రమలు ఏర్పాటై వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. మారుమూల ప్రాంతమైన చందన్‌వెల్లి నేడు పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడి ఇండస్ట్రియల్ పార్కులో ఐదేండ్లలోనే రూ.13,508కోట్ల పెట్టుబడులతో 40 పరిశ్రమలు ఏర్పాటై 3,210 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వెల్‌స్పన్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, దైపుకు, నికోమాక్ తైకిషా, కిటెక్స్ వంటి మెగా ప్రాజెక్టులు ఈ ప్రాంతంలోనే కొలువుదీరాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో ఒకటైన మేధా సంస్థ కొండగల్ వద్ద రూ.650కోట్ల పెట్టుబడితో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఉత్పత్తులను సైతం మొదలుపెట్టడం విశేషం.




పారిశ్రామిక రంగంలో తెలంగాణను అగ్రభాగాన ఉంచేందుకు జరిగిన నిరంతర శ్రమకు ఫలితంగా 2018లో ఆదిభట్లలో ప్రారంభమైన టాటా బోయింగ్ ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ

### పరిశ్రమల ఖిల్లాగా మేడ్చల్

తెలంగాణ రాష్ట్రంలోనే మేడ్చల్-మల్కాజిగిరి అత్యధిక పరిశ్రమలు ఉన్న జిల్లాగా నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్రం ఏర్పాడిన నాటి నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 11,610 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రూ. 15, 628,29 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 2, 26, 939 మందికి ఉపాధి లభించింది. జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నాయి. ప్రధానంగా విత్తన కంపెనీలు, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రొడక్షన్, ఫ్యాబ్రికేషన్, ఫార్మా తదితర కంపెనీలు ఏర్పడ్డాయి.



కొంగరకలాన్‌లో ఐఫోన్ ఎయిర్ పాడ్స్ యూనిట్‌ను స్థాపించేందుకు గత మార్చి 2న సీఎం కేసీఆర్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లీ

**మేడ్చల్‌లో 11,610 పరిశ్రమలు**
రూ. 15, 628.29 వేల కోట్ల పెట్టుబడులు
2, 26, 939 మందికి ఉపాధి
**రంగారెడ్డిలో 1, 252 పరిశ్రమలు**
వచ్చిన పెట్టుబడులు 47, 062.19 కోట్లు
ఉపాధి దక్కింది.. 5,15,851 మందికి

### తొమ్మిదేండ్లలో హైదరాబాద్ చుట్టూ ఏర్పాటైన ప్రముఖ పరిశ్రమలు

| పరిశ్రమ | నియోజకవర్గం | పెట్టుబడి (రూ.కోట్లలో) | ఉపాధి |
|---|---|---|---|
| టాటా బోయింగ్ ఏరోస్పేస్ | ఇబ్రహీంపట్నం | 87.14 | 531 |
| టాటా సికోర్‌స్కి | ఇబ్రహీంపట్నం | 59.82 | 366 |
| వెల్‌స్పన్ ఫ్లోరింగ్ లిమిటెడ్ | చేవెళ్ల | 1400 | 1800 |
| ఈస్టర్ ఫిల్మ్ టెక్ లిమిటెడ్ | చేవెళ్ల | 1400 | 800 |
| మేధా సర్వో డ్రైవ్స్ | చేవెళ్ల | 650 | 150 |
| ఆస్ట్రాల్ లిమిటెడ్ | చేవెళ్ల | 141.77 | 500 |
| విప్రో పర్సనల్ కేర్ | మహేశ్వరం | 278 | 800 |
| రేడియంట్ అప్లియెన్సెస్ | మహేశ్వరం | 100 | 1600 |
| భగ్‌వతి ప్రొడక్ట్స్ లిమిటెడ్ | మహేశ్వరం | 70 | 1,000 |
| సకుర ప్రీమియర్ సోలార్ | మహేశ్వరం | 196.56 | 456 |

### కొత్తగా మరో 19 ఇండస్ట్రియల్ పార్కులు

రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 16 ఇండస్ట్రియల్ పార్కులు ఉండగా..మరో మూడు పార్కులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. రావిర్యాల(ఈ-సిటీ), మహేశ్వరంలోని రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లు, ఇబ్రహీంపట్నంలో ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్, ముచ్చర్ల ఫార్మాసిటీ, చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటయ్యాయి. 19,333 ఎకరాల్లో రూ.63వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఫార్మాసిటీ ద్వారానే లక్ష మందికి పైగా ఉపాధి లభించనున్నది. సరుకు రవాణా సౌకర్యం కోసం బాట సింగారం, మంగళ్‌పల్లి వద్ద కొత్తగా లాజిస్టిక్ పార్కులు ఏర్పాటయ్యాయి. అయితే జిల్లాలో కొత్తగా మరో 19 ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్‌ఐఐసీ) అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. భూసేకరణ కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు సైతం పంపించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే దశలవారీగా ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఉద్యోగులకు నైపుణ్య శిక్షణా కేంద్రం వంటివి టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే ఈ పార్కుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

### అన్నింట్లోనూ అగ్రగామిగా..

☞ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అత్యధిక పెట్టుబడులు(32.15 శాతం), ఉపాధి (56.66శాతం) సాధించి రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అగ్రగామిగా నిలిచింది.

☞ 2014 నుంచి 2023 మధ్యకాలంలో జిల్లాలో పారిశ్రామిక యూనిట్లు 45 శాతం, పారిశ్రామిక పెట్టుబడులు 14 రెట్లు, పారిశ్రామిక ఉపాధి 11 రెట్లు పెరిగాయి.

☞ 2022-23(ఏప్రిల్-2022 నుంచి ఫిబ్రవరి-2023 వరకు) మధ్యకాలంలో జిల్లా నుంచి రూ.14,536కోట్ల విలువైన వాణిజ్య ఎగుమతులు, రూ.1,23,768కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి.

☞ 2014-2019 మధ్యకాలానికి టీఎస్-ఐపాస్ అమలులో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే 3వ స్థానంలో నిలిచింది.

☞ ఉత్తమ పనితీరు చూపిన కౌన్సిల్‌లలో ఒకటిగా ఎంఎస్‌ఈఎఫ్ కౌన్సిల్ రంగారెడ్డి రీజియన్ 2021లో కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును అందుకున్నది.

☞ గూగుల్, ఫేస్ బుక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్ వంటి టెక్ దిగ్గజ కంపెనీల అతిపెద్ద క్యాంపస్‌లు రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటై తెలంగాణ ఐటీ హబ్‌గా జిల్లా నిలుస్తున్నది.

### మేడ్చల్ జిల్లాలో ఉన్న పరిశ్రమలు

| పరిశ్రమలు | పెట్టుబడులు(కోట్లలో) | ఎంప్లాయిమెంట్(ఉపాధి) |
|---|---|---|
| మైక్రో(ఇండస్ట్రీస్) | 858.92 | 61,833 |
| స్మాల్ (ఇండస్ట్రీస్) | 6853.33 | 12,6644 |
| మీడియం (ఇండస్ట్రీస్) | 1076.49 | 15,589 |
| లార్జ్(ఇండస్ట్రీస్) | 2697,75 | 14,086 |
| మెగా(ఇండస్ట్రీస్) | 4141.8 | 8,787 |

### మేడ్చల్ జిల్లాలో ఉన్న ప్రధాన పరిశ్రమలు

- యూగీయ ఫార్మా
- బాయోలాజికల్ ఈ 1, 2, 3 ఫార్మా యూనిట్‌లు
- సింజన్ ఫార్మా
- కేఎంపీ ఫుడ్స్(బిస్కెట్ కంపెనీ)
- ప్యారగన్ కంజుమర్ ప్రై లిమిటేడ్(బిస్కెట్ కంపెనీ)
- పటేల్ ఇంజినీరింగ్(రైల్వేపాట్స్)
- ఇంటిగ్రెటెడ్ క్లీన్‌రూమ్ టెక్నాలజీ(ఎలక్ట్రానిక్స్)
- అఫ్తార్ ఫార్మా
- జెన్‌క్లాత్ ఫాలిమార్(గన్నిబ్యాగులు)

### మేడ్చల్‌లో త్వరలో రానున్న పరిశ్రమలు ఇవి...

హాస్పిటల్ అండ్ హెల్త్ ఇండస్ట్రి, శామీర్‌పేట్‌లో అమ్యూజ్‌మెంట్ అండ్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రి, కీసరలో నాలెడ్జ్ అండ్ సైన్స్, ఘట్‌కేసర్‌లో ఐటీ అండ్ ట్రాన్స్‌పోర్ట్

### భూసేకరణకు టీఎస్ఐఐసీ ఏర్పాట్లు

మేడ్చల్ జిల్లాలో అనేక మంది పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్న క్రమంలో టీఎస్ఐఐసీ భూ సేకరణ చేసి పారిశ్రామికవాడలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే జిల్లాలోని మాదారంలో 225 ఎకరాల్లో పారిశ్రామకవాడను తీర్చిదిద్దే పనిలో ఉండగా మరిన్ని భూములను సేకరించి పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయనున్నారు. మేడ్చల్, కీసర, పోచారం, బోడుప్పల్, చెంగిచెర్ల పరిధిలో భూ సేకరణకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐఐసీలో 5,603 మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పరిశ్రమల అనుకూల విధానాల వల్ల.. శంషాబాద్‌లోని విమానాశ్రయం సమీపంలో 2022లో స్థాపితమైన సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్స్ ప్లాంట్

### రంగారెడ్డి జిల్లాలో త్వరలోనే అందుబాటులోకి రానున్న కొన్ని భారీ పరిశ్రమలు

| పరిశ్రమ | నియోజకవర్గం | ఉత్పత్తి | పెట్టుబడి (రూ.కోట్లలో) | ఉపాధి |
|---|---|---|---|---|
| ఫాక్స్‌కాన్ | ఇబ్రహీంపట్నం | ఐఫోన్ ప్రొడక్ట్స్ | రూ.2,500 | 25,000 |
| ఆశీర్వాద్ పైప్స్ ప్రై.లిమిటెడ్ | చేవెళ్ల | పీవీసీ ప్రొడక్ట్స్ | రూ.406 | 570 |
| ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కంపెనీ | చేవెళ్ల | ఎలక్ట్రిక్ బస్సుల తయారీ | రూ.682 | 1800 |
| కింటెక్స్ అప్పారెల్ పార్క్స్ | చేవెళ్ల | గార్మెంట్స్ | రూ.1400 | 11,233 |
| ఈసిటీ | మహేశ్వరం | డేటా సెంటర్ | రూ.176.05 | 1400 |
| మలబార్ జెమ్స్, జ్యువెల్లరీ | మహేశ్వరం | పాలిష్డ్ డైమండ్ ప్రొడక్ట్స్ | రూ.182.61 | 1,822 |